# తాదాత్మ్యపు అంచున

సంభాషణ ప్రవహించి ఆగిపోతుంది

ప్రదర్శన మెలమెల్లగా  తొలగిపోతుంది

వాయిద్యం తీగల్లోకి తీయగా ముడుచుకుంటుంది.

చప్పట్లు థియేటర్ అక్వేరియంలోకి

చేప పిల్లలై ప్రవేశిస్తాయి.

అందరూ ఎవరికి వారే కొత్తగా పుట్టి

నడుచుకుంటూ వెళ్ళిపోతారు.

బొంగరపు మేకు కింద పొడవబడ్డ నేలలా

ఉంటుంది కన్ను

ఏడవకుండా... నవ్వకుండా...

విద్యుత్తులో అస్తిత్వాన్ని స్నానం చేయించినట్టుగా ఉంటుంది.

మేధస్సు ఒలికిన విషాదపు జీరలో...

ఏడుకలలని వెలిగించినట్టుగా ఉంటుంది.

శబ్ద కాలుష్యపు పొగలోంచి

నిద్రల పొలిమేరల్ని దాటుతూ

కళ్ళ దగ్గర నీటి బొమ్మై నిలబడినట్టుగా ఉంటుంది

జలపాతపు హోరును కొవ్వొత్తిలా పట్టుకుని,

లోయల్లోకి దిగుతున్నట్టుగా ఉంటుంది.

చినుకుతో తడిసిన మట్టివాసనని

దుప్పటిలా కప్పుకున్నట్టుగా ఉంటుంది.

అందరూ ఎవరికి వారే కొత్తగా పుట్టి నడుచుకుంటూ వెళ్ళిపోతారు.

ఒకడు కళ్ళల్లో మెరుపుడప్పును వాయిస్తూ, వానలా వెళ్లిపోతాడు

ఒకడు వాగ్గేయకారుడై తన ఆత్మ గర్భాన్ని
 పసిపిల్లవాడి ఏడుపులో వెదుకుతూంటాడు
ఒకడు మాధుర్యంతో తెగిన గుండె
 పరిసరాలపై నుంచి
 అక్షరాల అడవుల్ని నాటుతూంటాడు
ఒకడు మానవ సముద్రంలోకి
 నమ్మకమనే సబ్‌మెరీనై చొచ్చుకుపోతాడు
సంభాషణ ప్రవహించి ఆగిపోతుంది
ప్రదర్శన మెల మెల్లగా తొలగిపోతుంది
వాయిద్యం తీగల్లోకి తీయగా ముడుచుకుంటుంది.

సిద్ధార్థ
('దీపశిల' – 1994)